క్లుప్తంగా

నేటి నుంచి నట్టల నివారణ మందు పంపిణీ

పొదిలి: మండలంలో గురువారం నుంచి నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వేణు ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 10వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, ఆయా గ్రామాలకు సంబంధించిన షెడ్యూల్ ముందుగానే తెలియజేస్తామని పేర్కొన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారులు అందుబాటులో ఉండాలని సూచించారు.

పాఠశాలకు బీరువా వితరణ

కంభం: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు సహకరించడం అభినందనీయమని జంగంగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గని వెంకటేశ్వర్లు కొనియాడారు. పాఠశాలలో 2015–16లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు బుధవారం బీరువా అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

చలో ఒంగోలును విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు

బేస్తవారిపేట: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సంఘ నాయకుడు పానుగంటి షాలేంరాజ్ కోరారు. గురువారం జేసీ అగ్రహారంలో ఎమ్మార్పీఎస్ మహామేళా సభ పోస్టర్ ఆవిష్కరించారు. జూలై 7వ తేదీన ఎమ్మార్పీస్ 31 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఒంగోలులో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేదరమల్లి జయరాజ్, గోన మోహనరావు, ప్రసన్న, ప్రభాకర్, పీ సుబ్బారావు, డానియేల్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు


గాయపడిన స్వామిరంగయ్య

గిద్దలూరు రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన స్థానిక నంద్యాల రోడ్డులోని జగనన్న కాలనీ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎస్.బయనపల్లె గ్రామానికి చెందిన స్వామిరంగయ్య బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్వామిరంగయ్య తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బెస్త సంఘ అధ్యక్షుడి ఏకపక్ష వైఖరిపై నిరసన

- న్యాయం చేయాలంటూ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన 90 కుటుంబాలు


తహసీల్దార్‌కు వినతిపత్రం అంజేస్తున్న బెస్త కుటుంబాలు

కంభం: బెస్త సంఘం అధ్యక్షుడిగా ఉన్న బొందలపాటి వెంకటేశ్వర్లు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నాడని, అతని సోదరుడు సంఘ సభ్యులపై దౌర్జన్యం చేస్తున్నాడంటూ ఆ సంఘ మాజీ అధ్యక్షుడు ఇల్లా సోమయ్య ఆధ్వర్యంలో బుధవారం కమ్యూనిటీ భవనం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గత కొంత కాలంగా బెస్త సంఘానికి చెందిన రెండు వర్గాల మధ్య వివాదం కొనసాగుతోంది. గతంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోగా గుడి, శ్మశానవాటికకు సంబంధించిన సమస్యను పరిష్కరించారు. కాగా సంఘానికి చెందిన కమ్యూనిటీ హాల్లోకి తాము ప్రవేశించకుండా వెంకటేశ్వర్లు వర్గం తాళం వేసింది. దీనిపై ఇల్లా సోమయ్య వర్గానికి చెందిన సుమారు 90 కుటుంబాలు బెస్త కళ్యాణ మండపం ఎదుట బుధవారం నిరసనకు దిగారు. అనంతరం తహసీల్దార్ వి.కిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ.. గత నాలుగు నెలల నుంచి బెస్త సంఘం అధ్యక్షుడు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. సంఘానికి చెందిన 120 కుటుంబాలు వినియోగించుకునేలా ప్రభుత్వం కమ్యూనిటీ హాల్ నిర్మించి ఇచ్చిందని, అదేదో తమ సొంతమైనట్లుగా వెంకటేశ్వర్లు వర్గం వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని, అందుకే తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. ఇరువర్గాల వారు టీడీపీకి చెందిన వారు కాగా బుధవారం జరిగిన నిరసన కార్యక్రమంలో మార్కాపురం బీజేపీ నాయకురాలు శాసనాల సరోజిని, మొర్రిబోయిన చిన్నయ్య, పలువురు కంభం బీజేపీ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.

ప్రమాదంలో ప్రజారోగ్యం!

క్షేత్ర స్థాయిలో అమలు కాని ఆహార కల్తీ నిరోధక చట్టాలు

- మార్కెట్‌లోకి ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ అనుమతి లేని వస్తువులు?
- హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై పర్యవేక్షణ కరువు
- మార్కాపురంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీ



మార్కాపురం టౌన్:

ఆహార కల్తీ ప్రజారోగ్యానికి పెను సవాలు విసురుతోంది. చట్టాల అమలులో ఉదాసీనత, అధికారుల నిర్లక్ష్యం కల్తీరాయుళ్లకు వరంగా మారింది. ఆరోగ్యం బాగోలేదని ఆస్పత్రులపాలవుతున్న వారిలో కల్తీ ఆహార బాధితులు సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గత ఏడాది గ్లోబల్ ఫుడ్ రెగ్యులేటర్స్ సమ్మిట్ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన ఆహార భద్రతా సూచీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 28వ ర్యాంకు దక్కిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రజలకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందేలా చూడటం ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) లక్ష్యం. అయితే ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ అనుమతి లేకుండానే బహిరంగ మార్కెట్‌లో ఆహార ఉత్పత్తులను విక్రయిస్తుండటం ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతోంది. ఆహార పదార్థాల కల్తీని నిరోధించేందుకు రూపొందించిన వంట నూనెల నియంత్రణ చట్టం, ఆహార కల్తీ నిరోధక చట్టం, నిత్యావసర సరుకుల నియంత్రణ చట్టం, పాల ఉత్పత్తుల నియంత్రణ చట్టం, ఆహార భద్రతా చట్టాలు క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదన్న ఆరోపణలున్నాయి. ఆహార కల్తీకి పాల్పడిన వారికి ఆరు నెలల నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్షతోపాటు, భారీగా జరిమానా విధించేలా చట్టాల్లో పొందుపరిచినప్పటికీ ఎక్కడా అమలు కాకపోవడంతో కల్తీ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు.


ఫాస్టుఫుడ్ సెంటరులోని ఆహార పదార్థాలు

హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై పర్యవేక్షణ కరువు

పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గ కేంద్రాలతోపాటు పొదిలి, కంభం, బేస్తవారిపేట, ఇతర మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు సుమారు 500కు పైగానే ఉన్నాయి. ఆయా హోటళ్ల యజమానులు, బండ్ల నిర్వాహకులు ముడి సరుకుల కోసం హోల్‌సేల్ వ్యాపారులపైనే ఆధారపడతారు. ఈ నేపథ్యంలో వ్యాపారులు విక్రయిస్తున్న సరుకులు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో వినియోగిస్తున్న వస్తువుల నాణ్యతను తరచూ తనిఖీ చేయాల్సి ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అవేవీ పట్టించుకోవడం లేదు. మార్కెట్‌లో తక్కువ ధరకు లభిస్తున్న వస్తువులు, నూనెలు, టేస్టింగ్ పేస్టులు, సాల్ట్‌లు, మసాలాలు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ అనుమతి ఉన్నవేనా కాదా అనే విషయంపై చిరు వ్యాపారులకు అవగాహన లేకపోవడంతో కల్తీ వస్తువులతో వండిన ఆహారం ప్రజల చెంతకు సులువుగా చేరుతోంది.

ఆహార ప్రణాలను పాటించకపోవడంతోపాటు, రుచికోసం నాసిరకం ఆయిల్స్, మసాలాలు, టేస్టింగ్ సాల్ట్‌లను పరిమితికి మించి వాడటంతో తినేటప్పుడు రుచికరంగా ఉన్నా ఆ తరువాత కడుపులో మంట, గ్యాస్ సమస్యలకు గురవుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువకులు తోపుడు బండ్లపై చిరుతిళ్లకు అలవాటుపడుతుండటంతో బాల్య దశలోనే అనారోగ్యానికి గురవుతున్న పరిస్థితి ఏర్పడింది.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎక్కడ?

మార్కాపురం పట్టణంలో ఆహార పదార్థాల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి ఏళ్లు గడుస్తోంది. స్థానికంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో తనిఖీలు చేసేవారు కరువయ్యారు. ఇదే అదనుగా భావించిన కొందరు వ్యాపారులు, హోటళ్లు, ఫాస్టుఫుడ్ సెంటర్ల నిర్వాహకులు తెలిసీతెలియకుండా నాసిరకం వస్తువులు వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మార్కాపురం డివిజన్ పరిధిలోని హోటళ్లు, తోపుడు బండ్లను తనిఖీ చేసి ప్రజలకు నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

జూలై 9న మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె

గిద్దలూరు రూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జూలై 9న సమ్మె నిర్వహించనున్నట్లు సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య తెలిపారు. గిద్దలూరులోని ఎంఆర్‌సీ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం అందజేయడం లేదన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, మెనూ చార్జీలు ఒక్కో విద్యార్థికి రూ.20 చొప్పున ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు లక్ష్మీదేవి, నరసమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలోని పలు గ్రామాల్లో నూతన విద్యుత్ లైన్లు వేస్తున్న నేపథ్యంలో గురువారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఇడమకల్లు, నరసింహునిపల్లె, క్రిష్ణంపల్లె, లింగారెడ్డిపల్లె గ్రామాల్లో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని చింతలపల్లె, సూరవారిపల్లె గ్రామ పంచాయతీల్లో గురువారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

ట్రిపుల్ ఐటీకి 9 మంది విద్యార్థినుల ఎంపిక


వైవీటి చంద్రిక


షేక్ తస్లీమ్ ఫిర్దోస్


జి.ధనలక్ష్మి


పి.లహరిశ్రీ

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థినులు ట్రిపుల్ ఐటీ ఫేజ్–1లో ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీదేవి బుధవారం తెలిపారు. నూజివీడు క్యాంపస్‌కు చంద్రిక, తస్లీమ్ ఫిర్దోస్, మధురిమ, స్నేహశ్రీ, లక్ష్మీ తిరుపతమ్మలు, ఒంగోలు క్యాంపస్‌కు ధనలక్ష్మి, లహరీశ్రీ, తులసి, మహాలక్ష్మిలు ఎంకయ్యారని వెల్లడించారు. విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

రాజ్యాంగ హత్యా దినంపై అవగాహన కార్యక్రమం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఒంగోలు సిటీ: స్థానిక వెంగముక్కలపాలెంలోని క్విస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో బుధవారం రాజ్యాంగ హత్యా దినంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డీఆర్వో ఓబులేసు, సెట్ప్ సీఈఓ శ్రీమన్నారాయణ పాల్గొని మాట్లాడారు. వారు మాట్లాడుతూ స్వేచ్ఛాయుత భారత దేశంలో మన పాలకులు తప్పు చేస్తే తూర్పారబట్టే స్వేచ్ఛ ఉందన్నారు. తప్పు చేయకపోయినా మనకు సదరు నాయకుడు ముఖం నచ్చకపోతే తిట్టే స్వేచ్ఛ ఇక్కడి ప్రజలకు మన భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను ప్రజలకు దూరం చేసిన అర్ధ శతాబ్దం నాటి అత్యవసర పరిస్థితి ఓ చీకటి అధ్యాయమని అన్నారు. 1975లో భారత పౌరులపై అత్యవసర పరిస్థితి విధించడం అనేది ఓ పీడ కలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ ఎఱ్రాయేలు, కళాశాలల ప్రిన్సిపాల్ డా.కిషోర్‌బాబు, సెట్ప్ అసిస్టెంట్ మేనేజర్ రాజా, పావని, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధనమూర్తి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు


వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని నివాసంలో బుధవారం గిద్దలూరుకు చెందిన పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

మార్కాపురం: గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా వారిపై కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరెడ్డి హెచ్చరించారు. మండలంలోని రాయవరం, డ్రైవర్స్ కాలనీ, ఎస్టేట్, గజ్జలకొండ గ్రామాల్లో పాత నేరస్తుల ఇళ్లు, మద్యం దుకాణాలను ఎస్సై గోపాలకృష్ణ, సిబ్బందితో కలిసి బుధవారం తనిఖీ చేశారు. రాయవరం పలువురు పాత నేరస్తులకు, బడ్డీ బంకుల నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు మద్యం విక్రయిస్తే దుకాణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. మద్యం షాపుల్లో సమయపాలన పాటించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.


బడ్డీ బంకును తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ, ఎస్సై

పనుల్లో నాణ్యత పాటించాలి

గిద్దలూరు రూరల్: పట్టణంలో అభివృద్ధి పనులను నగర పంచాయతీ కమిషనర్ ఈ.వి.రమణబాబు బుధవారం పరిశీలించారు. క్లబ్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టును, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో, నల్లబండ బజారులో సీసీ రోడ్ల నాణ్యతను తనిఖీ చేశారు. రాజానగర్ ముందు భాగంలో సిమెంట్ రోడ్డుపై నీరు నిలిచే ప్రాంతాన్ని పరిశీలించి డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.కోటి, బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్ కింద రూ.కోటి నిధులతో పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పబ్లిక్ హెల్త్ డీఈ వి.శ్రీనివాసరావు, ఏఈ రవీంద్రయాదవ్, సిబ్బంది ఉన్నారు.


కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కమిషనర్

గ్రామాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

సంతనూతలపాడు: గ్రామాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. టార్గెట్ ప్రకారం కూలీలందరూ పనులకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. ఫారం పాండ్స్ పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల వర్షాలకు ఫారం పాండ్స్ పనులు ఆగినందున మళ్లీ ప్రారంభించాలన్నారు. అన్ని పంచాయతీలలో ఉపాధి పనులు ప్రారంభించి ఫీల్డ్‌లో కొలతల ప్రకారం కచ్చితంగా పని జరగాలన్నారు. ఉపాధి కూలీలకు కనీస వేతనం వచ్చేలా కొలతలు ఇవ్వాలని ఆదేశించారు. మండల ఏపీఓ వాసంతి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కుమారుడు తోసివేయడంతో గాయపడిన వ్యక్తి మృతి

అర్ధవీడు: కుమారుడు తోసివేయడంతో కిందపడి గాయాలపాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఆ వివరాల ప్రకారం.. అర్ధవీడు మండలంలోని పాపినేనిపల్లి పంచాయతీ బీసీకాలనీకి చెందిన సంసాని లక్ష్మీరంగయ్య (45) మద్యానికి బానిసై భార్య తిరుపతమ్మతో తరచూ గొడవపడేవాడు. ఇతనికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ నెల 23వ తేదీ రాత్రి 9.30 సమయంలో మద్యం సేవించి భార్యతో గొడవపడుతున్న లక్ష్మీరంగయ్యను అతని కుమారుడు రంగాఅంజి తోసివేయడంతో కిందపడి గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం కంభం వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి 7 గంటల సమయంలో లక్ష్మీరంగయ్య మృతి చెందినట్లు అర్ధవీడు ఎస్సై సుదర్శనయాదవ్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయం పరిశీలన

కొత్తపట్నం: ఐటీసీ–బంగారు భవిష్యత్తు వారి సహకారంతో గ్రామసిరి ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మండలాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న పంటలను బుధవారం అధికారులు పరిశీలించారు. ముందుగా రంగాయపాలెం గ్రామంలో కాటా సురేంద్ర ఏ గ్రేడ్ మోడల్, పులి ఆదిలక్ష్మి వేరుశనగ ఏ గ్రేడ్ మోడల్, వేమా రాఘవరెడ్డి ఏటీఎం మోడల్‌లో సాగుచేస్తున్న పంటలను పరిశీలించి ఆదాయ వ్యయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పురిణి మల్లేశ్వరి ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని సందర్శించి కషాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఘన జీవామృతం, ద్రవజీవామృతం, బీజామృతం, వివిధ రకాల కషాయాలను డెమో చేసి చూపించారు. మండలంలో సాగుచేస్తున్న అన్ని రకాల పంటల గురించి, వాటికి ఉపయోగించే కషాయాల గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామసిరి సిబ్బంది బసవయ్య, నాగేంద్రవర్మ, గీత, విజయలక్ష్మి, అనిల్‌కుమార్, నరసింహులు, కొట్టం, రెడ్డప్ప, దివాకర్ పాల్గొన్నారు.



కురువవే మేఘమా!

వాతావరణం చల్లబడింది. ఆకాశాన్ని నిమిషాల వ్యవధిలో కారుమబ్బులు కమ్మేశాయి. భారీ వర్షం కురుస్తుందని భావించినా మోస్తరు జల్లులకే పరిమితం కావడంతో రైతులు నిరాశ చెందారు. మృగశిరలో మంచి వర్షాలు కురిసి, భూముల్లో పచ్చిక పడి ముసలి ఎద్దులు రంకెలేస్తాయంటారు కానీ ఆశించిన మేర వాన పడలేదు. కొనకనమిట్ల మండలం గొట్లగట్టు వద్ద దట్టంగా కమ్ముకున్న మేఘాలు స్థానికులకు కాసేపు ఆహ్లాదాన్ని పంచాయి. – కొనకనమిట్ల